

# హైదరాబాద్ వార్త


# జాతీయ రహదారిపై దారి దోపిడీ దొంగలు

-వరుస చోరీలకు తెగబడుతున్నారు
-ఎదిరిస్తే హత్యకు కూడా వెనుకాడరు
-ప్రత్యేక పోలీసుల నిఘా పటిష్టం
-రాత్రి సమయాల్లో జాతీయ రహదారిపై పెట్రోలింగ్ పెంచిన ఎస్పీ



**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** హైదరాబాద్ నుంచి విజయవాడ జాతీయ రహదారిపై అర్ధరాత్రి ప్రయాణించాలంటే, సామాన్యులు తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవలసిన పరిస్థితి నెలకొంది. గత నెలన్నర రోజులుగా రహదారిలో దోపిడీ దొంగతనాలు ఎక్కువవుతుండడంతో రాత్రుళ్ళు అక్కడ ప్రయాణించే వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. పోలీసులు రహదారుల్లో జరిగే దారి దోపిడీలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. పార్కింగ్ చేసిన వాహనాల్లోంచి పెట్రోల్, డీజెల్ దొంగతనాలు మొదలుకొని, హత్యలు. దారి దోపిడీల వరకూ వరుస నేరాలు హైవే మీద పలు చోట్ల జరుగుతున్నాయి. గతంలో నగరంలో వివిధ ప్రాంతాల్లో దారి దోపిడీలు జరుగగా పోలీసులు అప్రమత్తమై నిందితులని పట్టుకున్నారు. రాజేంద్ర నగర్ ప్రాంతంలో పట్టపగలు నడిరోడ్డుపై కారాపిన దొంగల మూక, అందులోని వ్యక్తిపై దాడి చేసి ఒంటిమీద బంగారం లాక్కుపోయిన ఘటన కలకలం రేపింది. సన్‌సిటీకి చెందిన స్వీట్ షాప్ వ్యాపారి కన్నయ్య లాల్ తన కారులో అత్తాపూర్ మీదుగా ప్రయాణిస్తూ, పీవీ ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నెంబర్ 182 వద్దకు రాగానే అతడిని కొంతమంది గుర్తు తెలియని దుండుగలు అడ్డగించి, జనం చూస్తుండగానే హెల్మెట్లతో దాడికి దిగారు. అనంతరం నాలుగు తులాల బంగారు గొలుసును బలవంతంగా లాక్కుని పరారయ్యారు.

**వరుస ఘటనలు:**
హైవే పై ప్రయాణిస్తున్న డీసీఎం డ్రైవర్ దారుణ హత్య ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్‌లో సరుకు దిగుమతి చేసి తిరిగి వెళ్తున్న క్రమంలో అతడు రహదారి పక్కన చేతులు కాళ్ళు కట్టబడి, శవమై కనిపించాడు. గత నెల 18వ తేదీన ఆంధ్రప్రదేశ్ నుంచి సరుకును దిగుమతి చేసి తిరిగి వెళ్తున్న క్రమంలో అలసిపోయిన ఆ డ్రైవర్, కట్టంగూరు ప్రాంతంలో వాహనాన్ని పార్కింగ్ చేశాడు. అదే సమయంలో హఠాత్తుగా అక్కడకు వచ్చిన గుర్తు తెలియని దుండుగలు అతడిపై దాడిచేశారు. ఆ డ్రైవర్ కాళ్ళను తాళ్ళతో కట్టేసి, బలవంతంగా గొంతు నులిమి హతమార్చారు. అనంతరం అతడి వద్దనున్న డబ్బులు, బట్టలతో సహా నిలువు దోపిడీ చేసి అర్ధనగ్నంగా ఉన్న మృతదేహాన్ని రహదారి పక్కన పడేశారు. ఈ ఘటన ప్రయాణికుల్లో కలకలం రేపుతోంది. బస్సుల్లో ఊళ్ళు వెళ్ళే ప్రయాణికుల సైతం ఈ ఘటనను తలచుకుని బెంబేలెత్తుతున్నారు. ఇది మరువక ముందే మరో సంఘటన చోటు చేసుకుంది.

హైదరాబాద్‌కు సరుకుని దిగుమతి చేసేందుకు వెళ్తున్న మరో లారీ డ్రైవర్‌పై దారి దోపిడీ దొంగలు దాడి చేశారు. నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోట్టం వద్ద దారి కాచి ఉన్న దుండుగలు లారీని ఆపి, డ్రైవర్‌ను తాళ్ళతో కట్టేశారు. అనంతరం అతనిని విపరీతంగా కొట్టి, సుమారు రూ.22 వేల నగదు దోచుకున్నారు. కొన్ని గంటల పాటు శ్రమించి తెల్లవారుతుండగా తన కట్లు తానే విప్పేసుకున్న బాదితుడు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదుచేసుకున్న నార్కట్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఈ నెల 9వ తేదీ ఆదివారం తెల్లవారుఝామున కారులో ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న పలువురు అలసట రావడంతో, చిట్యాల మండలం పెద్ద కాపర్తి సర్వీస్ రోడ్డులో కారు ఆపారు. అప్పుడే బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని ఇద్దరు దుండుగలు కారులో నిద్రిస్తున్నవారిపై దాడి చేశారు. ప్రయాణికుల మెళ్ళో గొలుసులను, చేతి నుంచి ఉంగరాలనూ లాక్కున్నారు. ఈ దొంగలు అపహరించిన బంగారం 10 తులాలు ఉంటుందని తెలుస్తోంది. ఈ మేరకు బాధితులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

**రహదారుల్లో విశ్రాంతి చేటు:**
జాతీయ రహదారులపై దారిదోపిడీలు, హత్యలను ఛాలెంజింగ్‌గా తీసుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. ఎన్నికల కోడ్ సమయంలో పోలీసులు బిజీగా ఉండడంతో దారి దోపిడీ దొంగలు చెలరేగిపోయారని పోలీసులు పేర్కొన్నారు. పక్కా పథకం ప్రకారమే ఈ దొంగల ముఠాలు వరుస చోరీలు చేసినట్లు చెప్పుకొచ్చారు. ప్రయాణికులను రహదారుల్లో వాహనాలు ఆపి విశ్రాంతి తీసుకోవద్దని సూచించారు. వేరు వేరు బృందాలుగా విడిపోయిన ప్రత్యేక పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రహదారుల్లో పెట్రోలింగ్‌కై పలు పోలీసు బృందాలు విధులలో ఉన్నట్లు తెలిపారు. టోల్ గేట్లకు దగ్గరలోనే ఈ దోపిడీలు జరుగగా, క్లూస్ టీమ్ ఆధారంగా వివరాలు సేఖరించినట్లు తెలిపారు. నిందితులు ఉపయోగించిన వాహనాలు, దోపిడీలు చేసే విధానాలను గమనించి, ఇతర ప్రాంతాల నుంచి దొంగతనాల్లో ఆరితేరిన ముఠాగా పోలీసులు గుర్తించారు.

# తనిఖీలు ముమ్మరం..!

-ప్రైవేట్ హాస్టళ్లు,రెస్టారెంట్లపై పుడ్‌సేఫ్టీ దాడులు
-నిబంధనలు పాటించని హాస్టళ్లపై కేసులు
-వంటగది, డైనింగ్ శుభ్రతలపైనా ప్రత్యేక దృష్టి
-నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరికలు



మాదాపూర్‌లోని ప్రైవేట్ హాస్టల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పుడ్‌సేఫ్టీ అధికారులు

**హైదరాబాద్, జూన్ 19,ప్రభాతవార్త:** నిబంధనలకు విరుద్దంగా రెస్టారెంట్లు,ప్రైవేట్ హాస్టళ్లు నిర్వహిస్తున్న వారిపై ఫుడ్‌సేఫ్టీ విభాగం కొరడా ఝులిపిస్తుంది. అనుమతి లేకుండా హాస్టళ్లు నిర్వహిస్తూ అందినకాడికి దోచుకుంటున్న నిర్వాహకులపై జరిమానాలు విధిస్తూ కేసులు నమోదు చేస్తున్నారు. ఈమేరకు బుధవారం మాదాపూర్‌లోని పలు ప్రైవేట్ హాస్టళ్లలో గురువారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా తాజాగా పలు ఉమెన్స్ హాస్టళ్లపై దాడులు చేపట్టారు. సింధు జద్దు ఉమెన్స్ హాస్టల్‌లో డస్ట్‌బిన్‌లకు మూతలు లేకుండా ఉండటాన్ని గుర్తించారు. గడువు ముగిసిన మిరపపొడిని సీజ్ చేశారు. ఓంశ్రీ సాయి నేత్రం డల్స్ ఎక్స్‌మీల్‌లో వండే టప్పుడు వడ్డిస్తున్నప్పుడు గుట్కా నమిలే కార్మికులు, సింథటిక్ రంగుల వాడకం, కుళ్ళిన కూరగాయలు, బొద్దింకలు, తుప్పుపట్టిన దోస పెనం, అపరిశుభ్రత వాతావరణంలో వంటగది, సోయాసాస్ గడువు ముగియడం వంటివి గుర్తించారు. అలాగే తనుశ్రీ గ్రాండ్‌లో బొద్దింకలు, ఓపెన్ డస్ట్‌బిన్‌లతో అపరిశుభ్రమైన వంటగది, టొమాటో సాస్, చిల్లీ సాస్ నమూలను స్పాట్‌లోనే టెస్ట్ చేశారు. ఓంశ్రీసాయినంద ఉమెన్స్ హాస్టల్‌లో మూతలు లేకుండా డస్టబిన్ తెరిచి ఉంచినట్లు గుర్తించడంతోపాటు డైనింగ్ శుభ్రతపై అసహనం వ్యక్తం చేశారు. ఎస్‌ఆర్ లేడీస్ హాస్టళ్లలో పనిప్రదేశం, రిఫ్రిజిరేటర్ అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించడంతోపాటు . బియ్యం, కారం, పసుపు పొడి నమూనాలను సేకరించారు. అలాగే సంబంధిత హాస్టల్ యజమానులకు నోటీసులు జారీ చేశారు.

**నిర్వహణలో డొల్లతనం..**
గ్రేటర్ పరిధిలోని దిల్‌షుఖ్‌నగర్,అమీర్‌పేట్, ఎస్సాఆర్ నగర్ ప్రాంతాల్లో కోచింగ్ సెంటర్లు కుప్పలు తెప్పలుగా ఉన్నాయి.ఎన్నోరకాల రకాల సాఫ్ట్‌వేర్ హార్డ్‌వేర్ కోర్సులకు ఇక్కడి ఇన్‌స్టిట్యూట్స్ విద్యను అందిస్తాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు కోచింగ్ కోసం ఇక్కడకి వస్తారు. అయితే కొందరు నివాస భవనాలనే హాస్టళ్లుగా మార్చి మంచి లాభాలను పొందుతున్నారు. అయితే హాస్టళ్ల నిర్వభహణ వాణిజ్య పరమైన అంశంకిందకు వస్తుందని అధికారులు చెబుతుతున్నారు. హాస్టళ్ల ఏర్పాటుకు తగిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని తెలుపుతున్నారు. ఒకరకంగా చెప్పాలంటే హాస్టళ్లు అనేవి తక్కువ ధరకు లభించే హోటల్ వసతి లాంటివి.ఇందుకు జీహెచ్ఎంసీ నిబంధనల ప్రకారం భవనాన్ని నిర్మించాల్సి ఉంటుంది. ఆతర్వాత ట్రేడ్ లైసెన్స్‌ను దరఖాస్తు చేసుకోవాలి. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి నిరంభ్యంతర పత్రం తీసుకోవాల్సి ఉంటుంది.కానీ చాలా వరకు హాస్టళ్లు విచ్చలవిడిగా ఎలాంటి అనుమతులు లేకుండా నడుస్తున్నాయనే అరోపణలు వినిపిస్తున్నాయి.కొందరు నివాస భవనాలకే అనుమతులు తీసుకుని హాస్టళ్లు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఇలా జీహెచ్ఎంసీ ఆదాయానికి హాస్టళ్ల నిర్వాహకులు భారీగానే గండి కొడుతున్నారు. హాస్టళ్ల నిర్వాహకులు కేవలం డబ్బుపైనే దృష్టిపెట్టినట్లు తెలుస్తుంది. హాస్టళ్లలో నివసించే కొందరు విద్యార్థులు చెప్పిన ప్రకారం ఒకే గదిలో 6నుండి 8మందిని వరకు ఉంటారు. సామాగ్రి ఉంచుకోవడానికి లాకర్లు కూడా ఉండవు. వస్తువులను కూడా ఎక్కడ పెట్టుకోవాలో అర్థం కాదు. ఆహారం విషయంలో కూడా నిరా ్వహకులు నాణ్యతను పాటించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. కానీ అద్దెలు మాత్రం పెద్ద ఎత్తున వసూలు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు.కనీసం హాస్టళ్లు ఉన్న ప్రాంతాల్లో సీసీటివి కేమేరాలు కూడా కరువే ఇలా సౌకర్యాల పరంగా భద్రతాపరంగా హాస్టళ్ల నిర్వహణలో డొల్లతనం కొట్టివచ్చినట్లు కనిపిస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు.

# రైలు దొంగల పట్టివేత

## -విలువైన వస్తువులు స్వాధీనం



పోలీసుల అదుపులో రైలు దొంగలు

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** రైల్లో వరుస దొంగతనాలకు పాల్పడే ఇద్దరు నిందితులను కాచీగుడా రైల్వే పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు. వారి నుంచి గొలుసులు, నల్లపూసలు, ఉంగరాలు వంటి 74.12 గ్రాముల బంగారు ఆభరణాలు, 13 సెల్‌ఫోన్లు, రూ.6లక్షలు విలువైన యాపిల్ ట్యాబ్ ని స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీలసుల వివరాల ప్రకారం, గుర్‌గాంకు చెందిన ఆజాద్ ఖాన్ (30), నాగపూర్‌కు చెందిన పఠాన్ వసీమ్(33) హైదరాబాదుకు వలస వచ్చారు. క్యాటరింగ్ పనులు చేసే అజాద్‌కు హోటల్ బిజినెస్ నడిపే పఠాన్‌తో వృత్తి రీత్యా స్నేహం కుదిరింది. కుటుంబ సమస్యలు, హోటల్ బిజినెస్‌లో నష్టాల వల్ల ఇద్దరికీ నేర ప్రవృత్తి అలవడింది. అజాద్‌కు గతంలో కర్ణాటకలోని ట్రైన్లలో భారీ దొంగతనాలు చేసిన అనుభవం ఉండడంతో, పఠాన్‌ను భాగస్వామిగా చేసుకుని హైదరాబాద్‌లోని వివిధ స్టేషన్లలో రైలు చోరీ కొనసాగించాడు. ఈ క్రమంలో ఇద్దరూ కలిసి కాచిగుడా రైల్వే స్టేషన్ పరిదిలో బంగారం, మొబైల్ ఫోన్లు, ఒక యాపిల్ ట్యాబ్ దొంగిలించగా, వరుస ఫిర్యాదుల వల్ల నిఘా వేసిన రైల్వే పోలీసులకు చిక్కారు. దాంతో వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## సికింద్రాబాద్ స్టేషన్‌లో మరోసారి భారీగా గంజాయి పట్టివేత



రైల్వే పోలీసుల అదుపులో నిందితుడు, సీజ్ చేసిన గంజాయి ప్యాకెట్లు

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో మరోసారి భారీ ఎత్తున గంజాయి పట్టుబడింది. ఇటీవలె రెండు రోజుల వ్యవధిలో జరిగిన వేర్వేరు ఘటనలలో 47 కిలోల గంజాయిని తమ తనిఖీలలో భాగంగా సీజ్ చేసిన రైల్వే పోలీసులు, గంజాయి స్మగ్లింగ్ కేసులు వరుసగా నమోదవుతున్న నేపథ్యంలో బుధవారం ఉదయం ఆర్‌పిఎఫ్ అదికారుల ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు చేశారు. రైల్వే స్టేషన్ ఫ్లాట్‌ఫారంమీద మాత్రమే కాకుండా వచ్చిన ప్రతీ రైలులోనూ పోలీసులు సోధాలు నిర్వహించారు. ఈ క్రమంలో ఒడిశా నుంచి డిల్లీకి గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితుడిని సికింద్రాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఒడిశా రాష్ట్రం బలియపాడ గ్రామానికి చెందిన దిలీప్ కుమార్ నాయక్(34) అనే వ్యక్తి దాదాపు రూ.15లక్షల విలువ గల 60 కిలోల ఎండు గంజాయితో పోలీసులకు దొరికిపోయాడు. ఒడిశాలోని గజపతి అనే అటవీ ప్రాంతం నుంచి గంజాయిని తరలిస్తున్న నిందితుడు సికింద్రాబాద్ మీదుగా డెల్లీకి చేర్చే క్రమంలో విశాఖ ఎక్స్‌ప్రెస్ రైల్లో పోలీసులకు పట్టుబడ్డాడు. అతని వద్ద నుంచి సీల్ చేసిన పదుల సంఖ్యలో గంజాయి ప్యాకెట్లను, ఒక ట్రాలీ సూట్‌కేసును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు దిలీప్‌తో సంబంధం ఉన్న తపన్, బిజయ్ అనే ఇద్దరు ప్రధాన నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఒడిశాలోని అటవీ ప్రాంతంలో తపన్ నుంచి భారీ ఎత్తున గంజాయిని ప్యాక్ చేసి, సికింద్రాబాద్‌లో ఆర్గనైజర్ బిజయ్‌కి అందజేసే క్రమంలో జరిగిన సోధాల్లో నిందితుడు దిలీప్ పట్టుబడినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## అనుమతి లేని నిర్మాణాలు కూల్చి వేసిన అధికారులు

**నార్సింగి, జూన్ 19 ప్రభాతవార్త :**
అనుమతి లేని పలు నిర్మాణాలను బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారం కూల్చివేశారు. కార్పోరేషన్ పరిధిలోని బండ్లగూడ గ్రామంలో ఎలాంటి అనుమతి లేకుండా నిర్మించిన ప్లాంట్‌ను, శ్రీనివాస్ నగర్ కాలనీలో రోడ్డుకు అడ్డుగా ఉన్న ఓ నిర్మాణంను నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా టౌన్‌ప్లానింగ్ అధికారులు మాట్లాడుతూ అనుమతులు పొందిన మేరకే నిర్మాణాలు చేపట్టాలని, అసలు అనుమతులే పొందకుండా నిర్మాణాలు చేపడితే చట్ట పరిధిలో కఠినంగా శిక్షించడం జరుగుతుందని వివరించారు. పట్టణ విస్తరణ, అభివృద్ధి కోసం టౌన్‌ప్లానింగ్ నిబంధనలను ప్రజలందరూ గౌరవించాలని, పాటించాలని సూచించారు. అనుమతులకు విరుద్దంగా కొనసాగుతున్న పలు నిర్మాణాలకు నోటీసులు ఇచ్చామని, అయినా కొనసాగుతుంటే త్వరలోనే కూల్చివేతలు చేపడుతామని స్పష్టం చేశారు.

## ముగ్ధమనోహరం వన్షిక భరతనాట్య అరంగేట్రం



వర్షిక భరతనాట్య ఆరంగేట్రంలో ఒక దృశ్యం

**రవీంద్రభారతి, జూన్ 19 ప్రభాతవార్త :**
శ్రీరామ నాటక నికేతన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో బుధవారం రాత్రి ప్రఖ్యాత నాట్యగురువు కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత మంజుల రామస్వామి మనుమరాలు, త్యాగరాజన్ సుదర్శన్, రమ్య రామస్వామిల తనయ వన్షిక సుదర్శన్ భరతనాట్య ఆరంగేట్రం రసరమ్యం నవరసభరితం ముగ్ధమనోహరంగా సాగింది. పలు అంతర్జాతీయ జాతీయస్థాయిల్లో ప్రభుత్వ కార్యక్రమాల తోపాటు మరెన్నో ప్రదర్శనలిచ్చి ప్రేక్షకులను ఒప్పించి మెప్పింపు పొందింది. ఈరోజు వన్షిక ముందుగా నటరాజుకు పుష్పాంజలి సమర్పించి తన భరతనాట్య ఆరంగేట్రంను నిర్విఘ్నంగా కొనసాగేలా దీవించాలంటూ గణనాథుని వేడుకుంటూ శుభారంభం కావించింది. తదుపరి పదవర్ణం, శంకర శ్రీగిరి; విషమకర కన్నన్, తిల్లానా తదితర అంశాలను అత్యంత అద్భుతంగా ప్రదర్శించి ప్రతీఒక్కరి ప్రశంసలందుకుంది. గురువు మంజుల రామస్వామి నట్టువాంగం, గీతాగణేషన్ గాత్రం, రాజగోపాలాచారి మృదంగం; సాయికుమార్ వయోలిన్, దత్తాత్రేయ వేణువుతో వాద్యసహకారం అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పూర్వ ప్రభుత్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి, ప్రఖ్యాత నాట్యగురువు అలేఖ్య పుంజాల, నాగ్ అశ్విన్, రేణుచక్రవర్తి, సోనూ సూద్ తదితరులు హాజరై నర్తకి వన్షికను ఘనంగా సత్కరించి మున్ముందు గొప్పకళాకారిణిగా పేరుపొందాలని శుభాశీస్సులందజేశారు.

## ముగిసిన శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

**నాంపల్లి, జూన్ 19 ప్రభాతవార్త :** శ్రీ అలిమేలుమంగా, పద్మావతి దేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి పంచదశ వార్షిక అధ్యయన బ్రహోత్సవాల్లో ఈరోజు వేదపండితులు, అర్చకస్వాముల వేదమంత్రోచ్ఛారణలు మధ్య భక్తిశ్రద్ధలతో నయనానందకరంగా జరిగిన శతఘటాభిషేకంతో విజయవంతంగా పరిసమాప్తి అయ్యాయి. తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ నిర్వహణలోని ఎస్‌బిహెచ్ కాలనీ గాంధీనగర్ వద్ద ఉన్న అతిపురాతన శ్రీ సంగమేశ్వరస్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామి వార్ల దేవాలయంలో జూన్ 14 నుండి నేటివరకు 6రోజుల పాటు బ్రహ్మోత్సవాల్లో స్వామివారి విశేష కైంకర్యములలో నిత్యహోమము, శ్రీలక్ష్మీ సుదర్శన యాగము, ఎదుర్కోలు ఉత్సవం, ఉత్సవారంభ స్నపనం, నూత్తందాది, చాత్మర, విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహణం, అంకురారోపణం, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ట, చతుస్థావర్చన, ధ్వజాదిహోమం, ధ్వజారోహణం; బేరీపూజ, దేవతాహ్వానము, రథోత్సవము, శ్రీవారి కళ్యాణోత్సవం; నిత్యపారాయణ, శతఘటాభిషేకం ఇత్యాధి పూజాకార్యక్రమాలతో కన్నులపండువగా విచ్చేసిన అశేష భక్తజన సందోహాన్ని ఆధ్యాత్మికమార్గంలో పయనింపజేసి శ్రీవేంకటేశ్వస్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులను చేశాయి.

## పాతబస్తీలో యువకుడు దారుణ హత్య

**చార్మినార్,జూన్ 19 ప్రభాతవార్త :**
హైదరాబాద్ పాతనగరంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన శాలిబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..పాతబస్తీ కాలఫత్తర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన అసద్ రౌడీ షీటర్,అన్వర్ పాత నేరస్థుడు.అదే ప్రాంతానికి చెందిన వాజిద్,సాజిద్,ఖాదర్ అన్నదమ్ములు.అన్న దమ్ములు ముగ్గురు స్థానికంగా ఉన్న దక్కన్ బ్యాకరీలో పని చేస్తున్నారు.మంగళవారం అర్ధరాత్రి ఫాతిమా ఆసుపత్రి వద్దకు రావాలని అసద్ అన్వర్‌లు వాజిద్‌ను పిలిచారు.అదే సమయంలో అక్కడకు స్థానికంగా ఉన్న రఫీక్ సిమ్లాతో పాటు సాజిద్,ఖాదర్‌లు కూడ వచ్చారు.ఇరువర్గాల మధ్య పాత కక్షలు కారణంగా గొడవ జరిగింది.అసద్,అన్వర్‌లు రఫీక్ సిమ్లాన్‌పై మారణాయులతో దాడి చేయటంతో తీవ్ర గాయాలు అయ్యాయి.ఈ సంఘటనలో తీవ్ర గాయాల పాలైన రఫీక్ సిమ్లాన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.గొడవలో అన్నదమ్ములైన వాజిద్, సాజిద్,ఖాదర్‌లకు కూడ గాయాలు అయ్యాయని పోలీసులు వెల్లడించారు.నింధితుల కోసం పోలీసుల గాలిస్తున్నారు.ఈ కేసును శాలిబండ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.




## వివేక్‌కు మంత్రి వర్గంలో అవకాశం కల్పించాలి

**సైఫాబాద్, జూన్ 19 ప్రభాతవార్త:** ఒకవైపు పేద విద్యార్థులకు విద్యను అందిస్తూ, మరొక వైపు నిరంతరం సేవా కార్యక్రమాలు చేస్తూ, తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన దళిత, బహుజన నాయకుడు, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి వచ్చే రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణలో అవకాశం కల్పించాలని భీమ్ సైనిక్ ఫౌండేషన్ సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. బుధవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కలకోటి ఎన్.సత్యనారాయణ, వివిధ సంఘాల నాయకులు ఎం.ఎ.సిద్ధిఖీ, రవీందర్, శంకర్, సంపత్ తదితరులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన తెలంగాణ ఉద్యమ కారులకు అన్యాయం చేసిందని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వమైన న్యాయం చేయాలని కోరారు. కేంద్ర మాజీ జి.వెంకటస్వామి వారసత్వాన్ని పుచ్చుకుని వివేక్ వెంకటస్వామి సమాజానికి విశేషమైన సేవలు అందించారని, ఆయన సమాజానికి మరిన్ని సేవలు అందించడానికి వీలుగా సిఎం రేవంత్‌రెడ్డి ఆయనకు మంత్రి పదవి ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

### నులిపురుగుల రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలి



నులిపురుగులపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు, విద్యార్థులు

**సైఫాబాద్, జూన్ 19 ప్రభాతవార్త:** నులిపురుగుల రహిత సమాజం నిర్మాణ కోసం, ఆరోగ్యవంతమైన పిల్లల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సుల్తాన్‌బజార్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆరోగ్య కేంద్రం వైద్యులు, నర్సులు, సిబ్బంది, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో కలిసి వివిధ బస్తీలలో అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ ఒక సంవత్సరం నుంచి 9 సంవత్సరాల లోపు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని, ఈ మాత్రలు ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా పంపిణి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పిహెచ్‌ఓ డాక్టర్ పద్మజ, ఆర్‌బిఎస్‌కె మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మీనక్, డాక్టర్ రమేష్, హెచ్‌వి నర్సుబాయి, ఎఎన్ఎం జయలక్ష్మి, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

## బస్తీలో డిప్యూటి మేయర్ పాదయాత్ర

**తార్నాక, జూన్ 19 ప్రభాతవార్త:** వారంలో ఒక రోజు ప్రజా సమస్యలపై బస్తీలు, కాలనీల్లో పర్యటించి సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించేందుకు కృషి చేస్తామని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయా విభాగాల అధికారులు, కాంగ్రెస్ నాయకులు మోతె శోభన్‌రెడ్డితో కలిసి మాణికేశ్వరీనగర్ బస్తీలో డిప్యూటీ మేయర్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో డిప్యూటీ మేయర్ మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ముఖ్యంగా డ్రైనేజీ, విద్యుత్, మంచినీటి సమస్యలను డిప్యూటీ మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మాణికేశ్వరీనగర్ బస్తీ కమాన్ నుంచి బాక్స్‌డ్రైన్, ఆర్‌యూబీ, బస్తీదావఖానాను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అదేవిధంగా 50 పడకల హాస్పిటల్‌ను ను ఏర్పాటు చేసేలా కృషి చేస్తున్నామన్నారు. ఇదివరకే సీఎం దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. యూనివర్సిటీ అధికారులు, మంత్రుల దృష్టికి ఈసమస్యను తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ సుభాష్, ఈఈ ఆశాలత, డీఈ సువర్ణ, ఆర్‌యూబీ అధికారిని రేణుక, ఎంటమాలజీ అధికారి దుర్గాప్రసాద్, మెడికల్ ఆఫీసర్ రజినికాంత్, ఏఈ వెంకటేష్, డీజీఎం సరిత, ఏఈ శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

## నేడు బోయిన్‌పల్లి,మోండా మార్కెట్‌లు బంద్

**కంటోన్మెంట్,జూన్ 19 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ మోండా మార్కెట్ వర్తక సంఘం అధ్యక్షులు, తలసాని శంకర్ యాదవ్ ఈ నెల 10వ తేదీన అకాల మరణం చెందిన సందర్భంగా గురువారం సికింద్రాబాద్ ప్యాటీ న చౌరస్తా మహబూబ్ కళాశాల ఎస్.వి.ఐటీలో నిర్వహించ తలపెట్టనున్న సంతాప సభ సందర్భంగా బోయిన్‌పల్లి, మోండా మార్కెట్‌ల షాప్‌లకు బంధు నిర్వహిస్తున్నట్లు సికింద్రాబాద్ వెజిటేబుల్ కమీషన్ ఏజెన్సీ అసోసియేషన్ అధ్యక్షులు సోమ దేవేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు మిరియాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎస్.చంద్రారెడ్డి, మెంబర్ గిరిధర్‌లు ఎసంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆయా మార్కెట్‌లోని వ్యాపారస్థులు, కమిటీ మెంబర్లు సంతాప సభకు హాజరు కావాలని ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు.

## తీగలపై వాలిపోయిన చెట్టు కొమ్మలు కొట్టివేత

### (వార్త ప్రభావం)

**బేగంపేట జూన్ 19,ప్రభాతవార్త**

ఇటీవల కాలంలో నగరంలో కురిసిన భారీ వర్షానికి బ్రాహ్మణవాడీ మార్గంలో ఉన్న చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలపై వాలిపోయి గాలి వీచినపుడు నిప్పు రవ్వలు ఎగిసి పడ్డాయి.దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు,స్థానికులు తీవ్ర భయాందోళణలకు గురయ్యారు.ఈ ఘటనపై ఈ నెల 17వ తేదీన ప్రభాతవార్త హైదరాబాద్ మినీలో ,,విద్యుత్ తీగలపై వాలిన చెట్టు కొమ్మలు...రాలుతున్న నిప్పు రవ్వలు, అనే కథనం ప్రచురితమైంది.దీనిపై స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు ఎట్టకేలకు స్పందించారు.బుధవారం బ్రాహ్మణవాడీ మార్గంలో విద్యుత్ తీగలపై వాలి ఉన్న చెట్టు కొమ్మలను కొట్టి వేయడంతో సమస్య పరిష్కారమైంది.దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేసారు.వర్షాకాలంలో నిప్పురవ్వలతో ఏం ఇబ్బంది జరుగుతుందోనని ఆందోళణ వ్యక్తం చేసిన స్థానికులు విద్యుత్ తీగలపై ఉన్న చెట్టు కొమ్మలను కొట్టి వేయడంతో హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకున్నారు.

### ఆర్ఎంపి, పిఎంపిలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు పంపిణీ చేయాలి

**సైఫాబాద్, జూన్ 19 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఆర్ఎంపి, పిఎంపిలందరికి ప్రభుత్వం తక్షణమే గుర్తింపు ఇవ్వాలని తెలంగాణ ఆర్ఎంపి, పిఎంపి సంఘాల ఉమ్మడి వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొని హామీ ఇచ్చిందని, ఇచ్చిన హామీ ప్రకారం గుర్తింపు ఇవ్వాలని వేదిక కోరింది. ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేదిక ప్రతినిధులు చోప్పరి శంకర్‌ముదిరాజ్, రమేష్, గట్ల రమాశంకర్, డాక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వం 12 వేల మంది ఆర్ఎంపి, పిఎంపిలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికేట్లు ఇస్తామని ప్రకటించి, శిక్షణ ఇచ్చింది కాని సర్టిఫికేట్లు ఇవ్వలేకపోయిందని విచారం వ్యక్తం చేశారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ ప్రభుత్వం తమను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఆ 12 వేల మంది ఆర్ఎంపి, పిఎంపిలకు సర్టిఫికేట్లు ఇవ్వాలని, అలాగే రాష్ట్రం వ్యాప్తంగా ఉన్న మరో 20 వేల మంది ఆర్ఎంపి, పిఎంపిలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికేట్లు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. పేదలకు, గిరిజనులకు వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపి, పిఎంపిలపై మెడికల్ కౌన్సిల్ అధికారులు దాడులు చేస్తున్నారని, అన్యాయంగా కేసులు పెడుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఆర్‌పిఎం, పిఎంలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లును పంపిణి చేయాలని కోరారు.



రాహుల్ జన్మదినోత్సవం సందర్భంగా మొక్కలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు విశాల్ సుధామ్.



రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు



అన్నదానం చేస్తున్న మహిళా కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షురాలు పుస్తకాల కవిత



రాజీవ్ గాంధీకి నివాళులర్పిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే

## రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ మరింత బలపడింది

**బేగంపేటలో...**

**బేగంపేట జూన్ 19,ప్రభాతవార్త :** కోట్లాది మంది ప్రజల ఆశాకిరణం రాహుల్ గాంధీ అని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డా.కోట నీలిమ అన్నారు.బుధవారం రాహుల్ గాంధీ జన్మదినోత్సవం సందర్భంగా సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్లలో నిర్వహించిన జన్మదినోత్సవ వేడుకలలో కోట నీలిమ పాల్గొన్నారు.ఈ సందర్భంగా చెట్లు నాటడం,చిన్నారులకు నోట్ పుస్తకాల పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు విశాల్ సుధామ్,శ్రీనివాసరావు ,షేక్‌గౌస్, చిరంజీవి, నరేష్,శ్రీనివాసరెడ్డి,ఎంపి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

**బాచుపల్లిలో..**

**జీడిమెట్ల, జూన్ 19, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియజకవర్గంలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇంచార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి కేక్ కట్ చేసి రాహుల్‌గాంధీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబం నుంచి వచ్చిన గొప్ప నేత రాహుల్‌గాంధీ అని, ఆయన మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు సిద్దనోళ్ల సంజీవరెడ్డి, గడ్డం రాజేందర్‌రెడ్డి, గణేష్, గాగిలాపూర్ మాజీ సర్పంచ్ బాలరాజ్, ఏ బ్లాక్ ఎస్సీ సెల్ కన్వీనర్ సల్మాన్ రాజ్, నర్సింగ్‌రావు, నరేందర్‌రెడ్డి, వేణుగౌడ్, శ్రీనివాస్‌చారి, తులసిదాస్, ప్రసన్న కుమార్, నరేష్, అమీర్‌అలీ, శ్రీలతముదిరాజ్, ఫరీన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

**చిక్కడపల్లిలో..**

**చిక్కడపల్లి, జూన్ 19 ప్రభాతవార్త:** రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలో రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం పనిచేస్తూ ముందుకు సాగుతోందని మహిళా కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షురాలు పుస్తకాల కవిత అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని వివిధ దేవాలయాలతో పాటు ముషీరాబాద్ నియోజకవర్గంలో పలు దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్యాన్సర్ హాస్పిటల్ వద్ద రోగులకు పండ్లను పంపిణీ చేశారు. రాహుల్‌గాంధీ ఆయురారోగ్యాలతోఉండాలని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ ముషీరాబాద్ నియోజకవర్గం అధ్యక్షురాలు గజ్జల కవిత, జూబ్లిహిల్స్ నాయకురాలు ప్రీతి, అమీర్‌పేట డివిజన్ అధ్యక్షురాలు కె.రాజరాజేశ్వరి, మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు లావణ్య, మహిళా నాయకులు దేవి, వనిత తదితరులు పాల్గొన్నారు.పుస్తకాల కవిత మాట్లాడు తూ గతంలో మాదిరి కాకుండా ఈదఫా ఎన్‌డిఎ ప్రభుత్వా నికి గడ్డు పరిస్థితులు ఎదుర్కోక తప్పదని, నైతికంగా దేశంలో రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ గెలిచిందని అన్నారు.

**కంటోన్మెంట్‌లో..**

**కంటోన్మెంట్,జూన్ 19 ప్రభాతవార్త:** భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. రాజీవ్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం బోయిన్‌పల్లి ప్లేగ్రౌండ్ వద్ద కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అక్కడే ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొల్లు కిషన్, ముప్పిడి మధుకర్, షిరాజ్,మారుతీ గౌడ్, బల్వంత్ రెడ్డి పాల్గొన్నారు.

**నార్తలాలాగూడ, తుకారాంగేట్ ప్రాంతాల్లో...**

పేద ప్రజలను అధుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కాంగ్రెస్ ఓబిసి ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్ తెలిపారు. రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం నార్తలాలాగూడ, తుకారాంగేట్ ప్రాంతాల్లో పేదలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్ యాదవ్, పాపయ్య, రామారావు, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విజయ డెయిరీలో కాంట్రాక్టర్లకు అధికారులు అమ్ముడుపోయారు : కార్మిక నేతలు

**తార్నాక, జూన్ 19 ప్రభాతవార్త:**

విజయ డెయిరీలో కాంట్రాక్టర్లకు అధికారులు అమ్ముడు పోయారని కార్మిక నేతలు ఆరోపించారు. ఈ మేరకు లాలాపేట్ విజయ డెయిరీలో తెలంగాణ మిని లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆద్వర్యంలో కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దర్నా నిర్వహించారు. విజయ డెయిరీలో అధికారులు, లేబర్ ఆఫీసర్ కాంట్రాక్టర్లతో కుమ్మక్కు అయి కార్మికులకు రావలసిన ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించలేదని ట్రాన్స్‌ఫోర్టు కార్మికులు ఆరోపించారు. గత మూడు సంవత్సరాల నుంచి ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడంలేదని తెలిపారు. చాలీ చాలని వేతనాలతో జీవనం కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు తమకు వేతనాలను సకాలంలో ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయం కల్పించాలని కోరారు. ఈ సమస్యలను విజయ డెయిరీ ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కార్మిక నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కొరపాక అంజి, బాల్‌రాజ్, కార్యదర్శి మహీద్ ఖాన్, సాదిక్ హుస్సేన్, నయిమ్,సత్తి, కరుణ, బాలకృష్ణ, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్న మేయర్ లతాగౌడ్

**నార్సింగి, జూన్ 19 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని పలు కాలనీలలో మేయర్ మద్దెల లతా ప్రేమ్‌గౌడ్ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. రాధానగర్‌లోని ప్రజలు తమకు నీటి ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయని చెప్పడంతో జల మండలి అధికారులతో మాట్లాడి నీటి క్వాంటిటీని పెంచి సరఫరా చేయాలని సూచించారు. అలాగే మౌళిక వసతులైన మంచినీరు, డ్రైనేజి, వీధి దీపాలు, అంతర్గత రోడ్లు, పార్కులు, జిమ్ములు, స్మశాన వాటికలు, అదనపు తరగతి గదులు వంటి వాటికి తొలి ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. నీటి ఇబ్బందులను దూరం చేయడం కోసం జల మండలి ఉన్నతాధికారులను కలిసి, నీటి క్వాంటిటిని పెంచి సరఫరా చేయాలని కోరుతామని మేయర్ లతాగౌడ్ తెలిపారు. మేయర్ స్పందన పట్ల వివిధ కాలనీల ప్రజలు సంతోషంను వ్యక్తం చేస్తున్నారు.

### కలుషిత నీరు సరఫరా కాకుండా ప్రత్యేక చర్యలు

-కార్పొరేటర్ పావనీ వినయకుమార్

**చిక్కడపల్లి, జూన్ 19 ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్‌లో కలుషిత నీరు సరఫరా కాకుండా అన్నిచర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని బాపునగర్‌లో కలుషిత నీరు సరఫరా అవుతున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్, వాటర్ బోర్డు డిప్యూటీ జనరల్ మేనేజర్ కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్, సూపర్‌వైజర్ శంకర్, లైన్‌మెన్ పవన్ తదితరులు పర్యటించి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో కలుషిత నీటి సమస్యలు పలుమార్లు సూచనలుచేసినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పట్లకార్పొరేటర్ ఆగ్రహం వ్యక్తంచేశారు.సమస్యను వెంటనే పరిష్కరించనిపక్షంలో వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయ ముందు ఆందోళన చేయాల్సి వస్తుందని కార్పొరేటర్ హెచ్చరించారు. బిజెపి నాయకులఉ రాజేందర్, సాయికుమార్, ఆనంద్‌రావు, ముక్కపల్లి సాయి, బాపూనగర్ బస్తీవాసులు ఎన్.అశోక్, సతీష్, ఈశ్వర్, అనూరాధ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

### బల్కంపేట ఎల్లమ్మ హుండీ ఆదాయం రూ 92,29,521

**బేగంపేట జూన్ 19,ప్రభాతవార్త**

జంట నగరాలలో ఎంతో ప్రసిద్ది గాంచిన బల్కంపేట ఎల్లమ్మ ఆలయ హుండీల లెక్కింపు కార్యక్రమం బుధవారం పటిష్టమైన ఏర్పాట్ల నడుమ అధికారులు లెక్కింపు నిర్వహించారు.మార్చి 30 నుంచి జూన్ 19 వరకు మొత్తం 81రోజుల కు గాను సాధారణ హుండీలలో నోట్లు రూ 87,15,384లు,నాణేలు రూ 3,53,449లు మొత్తం రూ 90,68,833లు వచ్చాయి.అన్నదానం హుండీ రూ 1,60,688లు మొత్తం ఆదాయం 92,29,521లు,విదేశీ కరెన్సీ యూఎస్ డాలర్లు 58,సింగపూర్ డాలర్లు 21యూఏఈ దిరామ్‌లు,20సౌదీ రియాల్స్ 1వచ్చినట్లు అసిస్టెంట్ కమీషనర్,ఆలయ కార్యనిర్వహణాధికారి కె.అంజనీదేవి వెల్లడించారు.ఈ లెక్కింపు కార్యక్రమంలో ఛైర్మన్ కె.సాయిబాబాగౌడ్,దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ శ్రీదేవి,ఆలయ సిబ్బంది ఎస్సార్ నగర్ పోలీస్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది భక్తులు,బ్యాంక్ ఆఫ్ బరోడా ఎస్సార్ నగర్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

### బాగ్‌అంబర్‌పేట్‌లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



పుస్తకాలు పంపిణీ చేస్తున్న సునీతారావు, ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్,జూన్ 19,ప్రభాతవార్త:**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో బాగ్ అంబర్‌పేట్ డివిజన్ పోచమ్మబస్తీలో నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఈకార్యక్రమానికి రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు ముఖ్యఅతిధిగా హాజరై కేక్‌కట్‌చేసి పుస్తకాలు, స్టేషనరీ ఐటమ్స్ ను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ కోమల్ బాయ్, బ్లాక్ ప్రెసిడెంట్ ప్రసన్న, డివిజన్ ప్రెసిడెంట్ శాంతామణి, హర్షియాబేగం, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ కవిత, సెక్రటరీ ఫాతిమాబేగం, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## 'డాక్టర్ పైడి లక్ష్మయ్య, డాక్టర్ పిఎల్.సంజీవరెడ్డి స్మారక పురస్కారాల' ప్రదానం

**చిక్కడపల్లి, జూన్ 19 ప్రభాతవార్త:** రసమయి, డాక్టర్ పైడి లక్ష్మయ్య ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 'డాక్టర్ పైడి లక్ష్మయ్య, డాక్టర్ పిఎల్.సంజీవరెడ్డి స్మారక పురస్కారాల' ప్రదానోత్సవ కార్యక్రమాన్ని 24న చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వహించబోతున్నట్లు నిర్వాహక సంస్థ అధినేత, ప్రముఖ కవి డాక్టర్ ఎం.కె.రాము వివరించారు. తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరామ్ హాజరై ఈ పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భూగర్భగనుల శాఖ పూర్వ డైరెక్టర్ డాక్టర్ వీడి.రాజగోపాల్, సుప్రసిద్ధ వీణా విద్వాంసురాలు ఈమని కళ్యాణి, ప్రముఖ చలన చిత్ర దర్శకులు రేలంగి నరసింహారావు, గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి జగదీష్‌బాబులకు అందించబోతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దంతవైద్యనిపుణులు పద్మశ్రీ డాక్టర్ ఎస్.నారాయణ, ఆదాయపు పన్ను శాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ ఎం.నరసింహప్ప తదితరులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా హంసిని, నక్షత్ర, లక్ష్మీదుర్గా, శివాని, భవిష్య, నమ్రత తదితరులు 'కూచిపూడి నృత్యవిభావరి' నిర్వహిస్తారని, వ్యాఖ్యాతగా కళారత్న అవార్డుగ్రహీత ఎంకెఆర్.ఆశాలత నిర్వహిస్తారు.

### చిక్కడపల్లి పోలీసుస్టేషన్‌లో సెల్‌ఫోన్‌ల రికవరి

**చిక్కడపల్లి, జూన్ 19 ప్రభాతవార్త:** చిక్కడపల్లి పోలీసుస్టేషన్‌లో సెల్‌ఫోన్ చోరీకి గురైన బాధితులలో ఎంతో మందికి రికవరీ చేసి వారికి తిరిగి అందించడం జరిగిందని స్థానిక ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య అన్నారు. బుధవారం చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్ చోరీకి గురైందని బాధితులు ఎంఎల్ఎన్.మూర్తి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు ఆచూకి కనుగొని సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అందించగా వారు సంతోషం వ్యక్తం చేయడంతో చిక్కడపల్లి పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు సిఈఐఆర్ పోర్టల్ ద్వారా మొత్తం 130 సెల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందిండం జరిగిందన్నారు.

### పేద బ్రాహ్మణులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం



బ్రాహ్మణులకు ఆర్థికసాయం అందచేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** పేద బ్రాహ్మణులకు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆర్థిక సాయం అందచేశారు. బుధవారం అంబర్‌పేటలోని కార్యాలయంలో 13 మంది పురోహితులకు ఒక్కొక్కరికీ ఐదు వేల చొప్పున ఆర్థిక సాయం అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి నెలా తన సొంత నిధుల నుండి ఆర్థిక సాయం అందించి, పేద బ్రాహ్మణులను ఆర్థికంగా ఆదుకునే ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు. అనంతరం బ్రాహ్మణులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియచేసి, వేదాశీర్వచనం అందచేశారు.

### చార్మినార్ వద్ద ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



చార్మినార్ వద్ద యోగా ఆసనాలు

**చార్మినార్,జూన్ 19 ప్రభాతవార్త :**

హైదరాబాద్ పాతబస్తీ చారిత్రక చార్మినార్ వద్ద బుధవారం తెలంగాణ యోగా అధ్యయన పరిషత్ ఆధ్వర్యంలో పదివ అంతర్జాతీయ యోగా దినోత్సవం జరిగింది.ఈ కార్యక్రమానికి రాష్ట్ర అయూష్ శాఖ కమిషనర్ ప్రశాంతి,చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గం శాసన సభ్యులు మీర్ జుల్ఫీకర్ అలీ,ఫత్తర్‌గట్టి డివిజన్ కార్పొరేటర్ సోహెల్ ఖాద్రితో పాటు పలువురు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర అయూష్ కమిషనర్ ప్రశాంతి మాట్లాడుతూ యోగా వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని తెలిపారు.చార్మినార్ నుంచి గుల్జారాహౌస్ వరకు ర్యాలీ నిర్వహించారు.చార్మినార్ పరిసర ప్రాంతాలలో అయూష్,చార్మినార్ యునానీ తిబ్బి కళాశాల, హోమియోపతి విద్యార్థులు యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చార్మినార్ వద్ద యోగ ఆసనాలు ప్రదర్శించారు.

### తక్షణమే నీట్ పరీక్షను రద్దు చేయాలి

**సైఫాబాద్, జూన్ 19 ప్రభాతవార్త:** నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ఆమ్ ఆద్మీ పార్టీ విద్యార్థి, యువజన సంఘాలు బుధవారం ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించాయి. పార్టీ జాతీయ కమిటి పిలుపు మేరకు ఎవైడబ్ల్యూ, సివైఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆనేక మంది యువజనులు, విద్యార్థులు ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎవైడబ్ల్యూ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లంగి విజయ్, మలోతు సురేష్‌బాబు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా జరిగిన నీట్ పరీక్షా ఫలితాల్లో ముగ్గురికి మించి మొదటి ర్యాంక్ రాలేదని, ఈ సారి 67 మందికి మొదటి ర్యాంక్ రావడంతో ఆనేక అనుమానాలకు తావు ఇచ్చిందన్నారు. 23 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే ఈ నీట్ ఎగ్జామ్‌లో పెద్ద ఎత్తున అవకవతవకలు జరిగాయని, పేపర్ లీకేజీ జరిగిందని వారు ఆరోపించారు. తక్షణమే ఈ నీట్ పరీక్షలను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని, అవినీతి అక్రమాలపై విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో దర్శనం రమేష్, శ్రీనివాస్, విశాల్, మౌనిక, కంచర్ల అక్షయ్, మహమ్మద్ సోహల్, అహసాన్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు,

## కూకట్‌పల్లి నియోజకవర్గం ప్రజలకు రుణపడి ఉంటా : ఈటల రాజేందర్

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 19, ప్రభాతవార్త**

తనపై నమ్మకంతో విశ్వాసంతో పార్లమెంట్ సభ్యులుగా భారీ మెజార్టీ అందించిన కూకట్‌పల్లి నియోజకవర్గం ప్రజలకు ఎప్పుడు రుణపడి ఉంటానని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ అన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి అభ్యర్థిగా భారీ మెజార్టీతో విజయం సాధించిన ఈటెల రాజేందర్ తన గెలుపు తరువాత బుధవారం కూకట్‌పల్లి నియోజకవర్గం పర్యటనలో భాగంగా పలువురు ప్రముఖ నాయకులను, వ్యాపారవేత్తలను, పారిశ్రామికవేత్తలను, పార్టీ కార్యకర్తలను కలిశారు. ముందుగా కూకట్‌పల్లి బీజేపీ సీనియర్ నాయకులు సి.హెచ్.హనుమంత్‌రావుని వారి నివాసంలో కలిసి వారి ఆశీస్సులు తీసుకుని అక్కడి నుండి ప్రముఖ వ్యాపారవేత్త జనార్దన్ రావు ఇంట్లో నిర్వహించిన అల్పాహార విందులో బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు. తదనంతరం డివిజన్ పరిధిలోని మైత్రీ నగర్ కాలనీ అధ్యక్షులు ప్రముఖ పారిశ్రామికవేత్త జగ్గారావు నివాసానికి వెళ్లి అక్కడ విచ్చేసినటువంటి నాయకులకు, కార్యకర్తలకు, కాలనీ వాసులకు తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఈటెల రాజేందర్ ధన్యవాదాలు తెలిపారు.

## చిక్కడపల్లిలో తప్పిపోయిన వృద్ధురాలు

-చెంతకు చేర్చిన చిక్కడపల్లి పోలీసులు

**చిక్కడపల్లి, జూన్ 19 ప్రభాతవార్త:** 85 సంవత్సరాల వయస్సు గల వృద్ధురాలు తప్పిపోయి తిరుగుతుండగా చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పెట్రోలింగ్ సిబ్బంది బుధవారం స్టేషన్‌కు తీసుకువచ్చారు. పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీతయ్య ఆ వృద్ధురాలిని పేరు అడిగి తెలుసుకుని ఆమెను చేరదీసి అప్యాయంగా పలుకరించి వివరాలు సేకరించారు. తన పేరు మీసాల మరియమ్మ (85) తను విఎస్టీ విద్యానగర్‌లో ఉంటున్నట్లు తెలపడంతో ఆమె ఇచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు దర్యాప్తు నిర్వహించి చివరకు అదేప్రాంతంలో ఉంటున్న ఆమె మనువడు అయిన హేమంత్‌కు సమాచారం అందించారు. తన కుటుంబ సభ్యులకు తెలియకుండా ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆచూకీ తెలియకుండా తిరుగుతున్న వృద్ధురాలిని తమ పెట్రోలింగ్ సిబ్బంది తీసుకుని రావడం జరిగిందని ఇన్‌స్పెక్టర్ సీతయ్య వివరించారు. తమ నాయనమ్మను క్షేమంగా అప్పగించినందుకు చిక్కడపల్లి పోలీసులకు ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య పర్యవేక్షణలో ఎస్ఐ మౌనిక కేసును నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహించారు.

## వివిధ రంగాల వారిని సత్కరించడం మంచి సంప్రదాయం

-విశ్రాంత ఐపీఎస్ అధికారి జగన్మోహన్‌రెడ్డి



పురస్కారాలను ప్రదానం చేస్తున్న విశ్రాంత ఐపీఎస్ అధికారి ఎం.జగన్మోహన్‌రెడ్డి

**చిక్కడపల్లి, జూన్ 19 ప్రభాతవార్త:** వివిధ రంగాలకు చెందిన వారిని గుర్తించి సత్కరించడం మంచి సంప్రదాయమని విశ్రాంత ఐపీఎస్ అధికారి ఎం.జగన్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి శ్రీకిరణ్ సాంస్కృతిక సమాఖ్య, శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో 'ఏకాపద్మ స్మారక పురస్కార ప్రదానోత్సవం' సభ చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు లంకా వెంకట సుబ్రహ్మణ్యం, భాను ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరై జగన్మోహన్‌రెడ్డి ఈ పురస్కారాన్ని అంకాలజీ నిపుణురాలు డాక్టర్ భుక్యశ్వేతకు ప్రదానం చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త పొత్తూరి పవన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళావి ఎస్.జనార్ధనమూర్తి, నేటినిజం పత్రిక ఎడిటర్ బైసాదేవదాస్, అంకాలజి నిపుణులు డాక్టర్ పిఎస్.దత్తాత్రేయ, సాహితికిరణం మేనేజర్ పొత్తూరి జయలక్ష్మి, పద్మ ఆప్టికల్స్ అధినేత్రి ఏకా నాగరాజు రామ్మోహనరావు, ఏకా వేంకట సంవర్ధని పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE I JUNIOR CIVIL JUDGE:CITY CIVIL COURTS: AT : SECUNDERABAD**

**OS NO. 483 / 2021**

**Between:**

**State Bank of India, Retail Assets Central Processing Centre -I, SARC Wing, Patny Centre, Secunderabad, Rep. by its Manager .....Plaintiff**

**And**

**Sri Mole Surender Goud and antoher .....Defendants**

**To,**

**Sri Mole Surender Goud S/o Mole Kondanna Goud,** R/o H.No. 5-83, Musapet, Addakal, Sankalmaddi, Mahabubnagar – 509 380. O/o Driver, TSRTC, Ranigunj – I, Secunderabad-03.

Please take notice that the above named plaintiff instituted the above suit against you as Defendant no.1 for recovery of **Rs. 1,22,364-00 Ps.** You are hereby summoned to appear in this court in person or by pleader duly instructed and able to answer all material questions on **03-07-2024 at 10.30 AM.** In default of your appearance the suit will be heard and decided in your absence.

By order of the Court

**D.K. Lakshmi Kumari, Advocate**
**Flat No.304, H.No. 8-90/34/5 & 8-90/35/5**
**Manikanta Paradise Apts., Dwarakanagar, Phase-II, Uppal, Hyderabad - 500 039.**
**Cell No. 99488 68080**

**BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL-II, AT: TRIVENI COMPLEX, 1st FLOOR, ABIDS, HYDERABAD**
**O.A.NO.912 OF 2023**

**Between :**
**Bank of Baroda (Erstwhile Vijaya Bank)** Film Nagar Branch, Jubilee Hills, Hyderabad, Rep by its Chief Manager. **...Applicant**

**And**

Mr.Arnachalam Siva Kumar **...Defendant/s**

**SUMMONS BY WAY OF PAPER PUBLICATION**

To,
Mr.Amachalam Siva Kumar, S/o. Sri. Arnachalam Vankanan, aged 38 yrs, R/o.H.No. 21-111/1, Syndicate Bank Colony, Saroornagar, Ranga Reddy - 500 035
**Also at:**
Mr.Amachalam Siva Kumar, S/o.Sri. Arachalam Vankanan, aged 38 yrs, R/o.Plot No.105, P9, P10, P11, Aashirwad Heights, Road No.6, Near Maruti Nagar Community Hall, Saroornagar, Ranga Reddy - 500 035 **....Defendant/s**

Please take the summons in the above O.A. No. 912/2023 filed by the applicant for recovery of money of Rs.21,32,618/- against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in **"VAARTHA"** daily newspaper and posted the matter to 31/07/2024.

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under;
(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted.
(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application.
(iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties.
(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest in created and/ or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal.
(v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are directed to appear before this Tribunal at Debts Recovery Tribunal-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001 in person or through an Advocate and file Written Statement on 31.07.2024 at 10.30a.m. and show cause as to why reliefs prayed for should not be granted.

Take Notice that in case of default the Application will be heard and determined in your absence.

Given under my hand and seal of this Tribunal on this day 15th of June, 2024.

**(By Order of the DRT-II, Hyderabad)**

**Sd/- Signature of the Officer Authorized to issue Summons**

**IN THE COURT OF THE XI JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT SECUNDERABAD**
**O.S.NO. 369 OF 2024**

**Between :**
Smt Madala Nirmala & Others **...Plaintiff**

**And**

1. The Mandal Revenue Officer, Maredpally Mandal, Secunderabad.
2. All Concerned **...Defendants**

**NOTICE**

To,
All Concerned

The general public are hereby informed that the above petition is filed to declare the plaintiffs as legal heirs of the deceased Late Madala Venkata Appa Rao and the same is posted to 28.06.2024 for objections if any by anybody he/she may appear at 10.30 a.m before the Hon'ble court either in person or through advocate failing which the case will be decided in your absence.

Sd/- **D.PREM KUMAR**
For Plaintiff
H.No.12-11-226,
Warasiguda,
Secunderabad-61.
**Cell : 98482 94276**

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ

GHMC

నిట్ నం. 10/E.E.14/GHMC/2024-25, తేది: 19.06.2024

పనిపేరు: GHMC, KZ, డివిజన్-14 క్రింద వివిధ పనులు. అంచనా మొత్తం/ECV: రూ.లక్షలలో 64.45. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: 20.06.2024 ఉ.11.00గం. 27.06.2024 ఉ.11.00గం. అధికారి పేరు, చిరునామా: EE-14, GHMC, 5వ అంతస్తు, ఆబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, ఆబిడ్స్, హైదరాబాద్. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్ సైట్ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-14, GHMC.

DIPR.No.877-PP/CL/Advt/1/2024-25 తేదీ: 19.06.2024

## శ్మశాన వాటికల అభివృద్ధికి కృషి చేస్తా: శ్రీగణేష్



మారేడ్‌పల్లి హిందూ స్మశాన వాటికలో కర్మషెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోనె మ్మెంట్,జూన్ 19 ప్రభాతవార్త:** మారేడ్‌పల్లి హిందూ స్మశాన వాటికను మరింత అభివృద్ధి పర్చేందుకు కృషి చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. మారేడ్‌పల్లిలోని హిందూ స్మశాన వాటికలో గుండెల్లి రాజయ్య జ్ఞాపకార్థం మహేశ్, రాహుల్, ప్రవీణ్ ప్రమోద్‌ల సహకారంతో నిర్మించిన కర్మషెడ్డును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ హిందూ స్మశాన వాటికలో మౌళిక సదుపాయాలు మెరుగుపర్చి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో స్మశాన వాటిక కేర్‌టేకర్ సదానంద్, అధ్యక్షులు వెంకట్ స్వామి, అడ్వైజర్ రవిందర్, ఉపాధ్యక్షులు చిట్టిబాబు,ఉమా శంకర్,జి.మల్లేశ్, హంసరాజ్, దీమ్‌రావ్, కాంగ్రెస్ నాయకులు సంకి రవిందర్, సి.సంతోష్ యాదవ్, బద్రినాథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలే నాకు ముఖ్యం : ఎమ్మెల్యే

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 19, ప్రభాతవార్త**



సమీక్ష సమావేశం మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలే నాకు ముఖ్యమని, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా ముందుకు వెళ్తానని, అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి, జిల్లా మంత్రి, పార్లమెంట్ సభ్యులను కలుస్తానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జిహెచ్ఎంసి అధికారులతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా వేల కోట్ల రూపాయలతో కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేశామని ప్రభుత్వాలు మారిన ప్రజలకు చేసే అభివృద్ధిలో ఎలాంటి ఆటంకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మందాడి శ్రీనివాసరావు, ముద్దం నరసింహయాదవ్, పండాల సతీష్‌గౌడ్, శిరిషా బాబురావు, ఆవుల రవీందర్‌రెడ్డి, జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్, కూకట్‌పల్లి నియోజకవర్గం కో ఆర్డినేటర్ సతీష్ అరోరా, లింగాల ఐలయ్య, శ్రీహరి, జిహెచ్ఎంసి అధికారఉలు రమేష్, ఎస్.సి.చెన్నారెడ్డి, ప్రభాకర్, ఈఈ సత్యనారాయణ, సిఈ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## జగదీష్‌ను కలిసిన శ్రీనివాస్ గుప్త



నూతనంగా ఎన్నికైన తెలంగాణ గన్నిమర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు జగదీష్‌ను కలిసిన జాతీయ ప్రజాఏక్తాపార్టీ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త

**అఫ్జల్‌గంజ్,జూన్19ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర గన్నిమర్చంట్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా జగదీష్ ఎన్నికయ్యారు. ఈమేరకు కిషన్‌గంజ్‌లోని మర్చంట్ కార్యాలయంలో జాతీయ ప్రజా ఏక్తాపార్టీ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త మర్యాదపూర్వకంగా కలిశారు.ఈసందర్భంగా జగదీష్‌ను శాలువ కప్పి సన్మానించారు.ఈకార్యక్రమంలో పోకల కైలాశం,పి.శేఖర్,ప్రజాఏక్తాపార్టీ ప్రతినిధులు దూత్ పాలనరేష్‌తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గన్నిమర్చంట్‌కు పార్టీ పరంగా తనవంతు సహాయ సహాకారాలను అందిస్తానన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల యజమానులు మహాధర్నా..

**పేట్ బషీరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త**

తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యంలో సుచిత్రలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి ప్రభుత్వ గుర్తింపు లేకుండా 300మంది విద్యార్థులను చేర్చుకొని పాఠశాల ప్రారంభోత్సవం చేస్తున్నారు. దీన్ని గమనించిన ఇతర పాఠశాల యాజమాన్యాలు పెద్ద ఎత్తున శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ముందు ధర్నా చేశారు. స్టేట్ తెలంగాణ ప్రైవేట్ పాఠశాల అధ్యక్షుడు మధుసుధన్ మాట్లాడుతూ నైతిక విలువలులేని, సామూజిక విలువలు తెలియని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌ను మూసి వేయాలని కోరారు. తెలంగాణ ప్రైవేట్ స్కూల్ సెక్రటరీ ఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై క్రిమినల్ కేసులు పెట్టాలని కోరారు. మేడ్చల్ జిల్లా ప్రైవేట్ పాఠశాల అధ్యక్షుడు రామేశ్వరరెడ్డి మాట్లాడుతూ స్కూల్‌కు వ్యత్యాసం లేకుండా నడపడం, బడ్జెట్ పాఠశాల దెబ్బతీయడం శోచనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ప్రైవేట్ పాఠశాలల మండల ప్రెసిడెంట్ మహేష్, సెక్రటరీ రవి, సెయింట్ అంథోనీ హై స్కూల్ కరెస్పాండెంట్, మాజీ అధ్యక్షుడు వరప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్, మల్లేష్ చింత, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ సెక్రటరీయట్‌లోని పాఠశాల ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేష్ ఐఏఎస్‌ని కలిసి వినతిపత్రం ఇచ్చి కార్పొరేట్ పాఠశాలను నియంత్రణ చేయాలని బడ్జెట్ పాఠశాలల హక్కులను కాపాడాలని కోరారు. వెంటనే శ్రీ చైతన్య స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

## మా ఆవిడ కోసమే కాఫీ తాగుతున్నా : సినీహీరో శర్వానంద్

**హైదరాబాద్,జూన్ 19,ప్రభాతవార్త:** కాఫీ,టీ అలవాటు తనకు లేదని కానీ పెళ్ళి అయ్యాక మా ఆవిడకు కాఫీ అంటే చాలా ఇష్టమని .ఆమె కోసం తాను కూడా కాఫీ తాగుతున్నానని సినీ హీరో శర్వానంద్ పేర్కొన్నారు. ఈమేరకు జూబ్లీహిల్స్‌రోడ్ నెంబర్ 44లో శర్వానంద్ సోదరుడు ఏర్పాటు చేసిన బీన్జ్‌కాఫీ స్టోర్‌ను తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా, ఏపీ రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ,హీరో శర్వానంద్‌లు ముఖ్యఅతిధులుగా హాజరై ప్రారంభించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన విభిన్న రుచులను మంత్రులు రుచి చూశారు. తనకు బీన్జ్‌రెస్టారెంట్‌తో ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయని ,అప్పట్లో కాఫీ షాప్‌లో సినీహీరోలు రాంచరణ్, అఖిల్ ,బన్నీలతోపాటు మరికొంత మంది హీరోలంతా సరదాగా గడిపేవాళ్లమని గుర్తుచేసుకున్నారు. తమ స్నేహితులు ఎప్పుడు కలిసినా కాఫీషాప్‌లోనే కలిసేవారిమని చెప్పారు. నిర్వాహకులు అర్జున్ మైనేని మాట్లాడుతూ విభిన్న రుచులతోపాటు కాంటినెంటల్ రెసిపిలను నగర వాసులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ మంజుల అనగాని, డి.వంశీకృష్ణంరాజు, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తలసాని కుటుంబ సభ్యులను పరామర్శించిన మైనంపల్లి



తలసానిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావ్

**కంటోనె మ్మెంట్,జూన్ 19 ప్రభాతవార్త:** మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను బుధవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావ్‌లు పరామర్శించారు. ఇటీవల తన సోదరుడు తలసాని శంకర్ యాదవ్ మరణించగా బుధవారం వారు తలసాని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ ఌసంతాపం, సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జితేంద్రనాథ్, జయసింహ పాల్గొన్నారు.

### ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ : కొలన్ హన్మంత్‌రెడ్డి

**నిజాంపేట్, జూన్ 19, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రజలకు ఏ సమస్య వచ్చినా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కొలన్ హన్మంత్‌రెడ్డి అండగా నిలుస్తున్నారు. కాగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 131 డివిజన్ గణేష్ నగర్‌కు చెందిన రవికుమార్ కుమార్తె ప్రస్తుతి గత కొన్ని రోజులుగా టర్నర్ సింద్రోమ్ అనారోగ్యంతో బాధపడుత, నిజాం హాస్పిటల్‌లో చికిత్స పొందుటకు ఆర్థిక స్థోమత లేకపోవటంతో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కొలన్ హన్మంత్‌రెడ్డిని సంప్రదించగా వెంటనే ఆయన స్పందించారు. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ద్వారా బాధితురాలి శస్త్ర చికిత్స నిమిత్తం రూ.2,10,000 సీఎం సహాయనిధి ఎల్ఓసీని మంజూరు చేయించారు. మంగళవారం మంజూరైన ఎల్ఓసి పత్రానలు కొలన్ హన్మంత్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యలకు అందజేశారు.

## మహానంది అవార్డు గ్రహీతకు చిరు సన్మానం..

**జీడిమెట్ల, జూన్ 19, ప్రభాతవార్త**

ఇటీవల హనుమకొండలో జరిగిన తెలంగాణ సాహితీ సేవ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో తెలంగాణ సంస్రృతి సాహితీ బుక్ ఆఫ్ రికార్డు జాతీయ నంది పురస్కారం పొందిన ముదిరాజ్ ముద్దుబిడ్డ నిరంతరం జాతి అభివృద్ధి ఐక్యత కోసం కృషి చేస్తున్న తోడేటి సత్యం ముదిరాజ్‌కు జాతీయ మహానంది అవార్డు రావడం సంతోషంగా ఉందని ప్రకృతి ప్రేమికుడు, సమాజ సేవకుడు కొలా రవీందర్ ముదిరాజ్ పేర్కొన్నారు. మంగళవారం తోడేటి సత్యం ముదిరాజ్‌ను కొలా రవీందర్ ముదిరాజ్ శాలువాతో సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత స్థానానికి ఎదిగిన జాతి బిడ్డలను గౌరవించుకోవడం మన ధర్మం అని, సత్యం ముదిరాజ్ సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. అనంతరం సత్యం ముదిరాజ్ మాట్లాడుతూ ఉన్న ఊరికి, కన్న తల్లికి, జాతి అభివృద్ధికి చేసిన సేవ ఎంతో విలువనిచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్‌రెడ్డి, బిజెపి నాయకులు చెంది శీను ముదిరాజ్, పొల్కం విఘ్నేష్ ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం..

**జీడిమెట్ల, జూన్ 19, ప్రభాతవార్త**

డిగ్రీ చదువుతున్న ఓ యువతి అదృశ్యమైన సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎన్.సురేష్ తల్లిదండ్రులు, డిగ్రీ చదువుతున్న చెల్లెలు ఎన్.సంధ్య (20) తో కలిసి జీవీకే సూరారంలో నివాసం ఉంటున్నారు. ఎప్పటిలాగే బుధవారం రోజు ఇంట్లో అందరూ తమ పనులకు పోగా సంధ్య ఒక్కటే ఇంట్లో ఉంది. సాయంత్రం అందరూ ఇంటికి వచ్చేసరికి సంధ్య కనిపించలేదు. కుటుంబ సభ్యులు అందోళనతో చుట్ట ప్రక్కల అంతా వెతికినా, తెలిసినవారిని, బంధువులను అడిగినా ఆచూకి తెలియకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. కాగా కుటుంబ సభ్యులు కరావత్ సురేష్ అనే వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా అతనిపై కంప్లైంట్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు సూరారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివి : లక్‌పతి యాదగిరి గౌడ్



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న లక్‌పతి యాదగిరి రెడ్డి తదితరులు

**హైదరాబాద్, జూన్ 19 ప్రభాతవార్త:** దేశానికి ప్రధానమంత్రిగా రాజీవ్ గాంధీ చేసిన సేవలు మరువలేనివని టీపీసీసీ సెక్రటరీ, కంటెస్టెడ్ కార్పొరేటర్ లక్‌పతి యాదగిరి గౌడ్ తెలిపారు. మాజీ ప్రధాని స్వర్గియ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా న్యూ నల్లకుంట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి. లక్ష్మణ్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా జరిపారు. నల్లకుంట ఫివర్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఆర్థిక సంస్కరణలను అమలు జరిపిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాలకు రాజీవ్ గాంధీ ఊతమిచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శంకర్, ఆర్ఎంఓ జయలక్ష్మీ, చంద్రశేఖర్, నేతలు టీపీసీసీ ఓబీసీ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, సేవాదళ్ మాజీ ప్రెసిడెంట్ పొన్నడ సుబ్రమణ్యం, నరేందర్‌రెడ్డి, శరత్, మురళి, కృష్ణాగౌడ్, దిలిప్, నర్సింగ్, కిరణ్, రవికుమార్ పాల్గొన్నారు.

### స్నేహితుడిని కత్తితో పొడిచిన యువకుడు

**చార్మినార్,జూన్ 19 ప్రభాతవార్త :** డబ్బుల విషయంలో జరిగిన వివాదంలో ఓ యువకుడు తన స్నేహితుడిని కత్తితో పొడిచిన సంఘటన పాతబస్తీ శాలిబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం..శాలిబండ ప్రాంతానికి చెందిన ఫిరోజ్ (24),ఫయాజ్ (26) స్నేహితులు.తాగిన మైకంలో మంగళవారం అర్ధరాత్రి ఇద్దరి మధ్య డబ్బుల విషయమై వివాదం జరిగింది. కోపంలో ఫయాజ్ ఫిరోజ్‌పై చాకుతో దాడిచేయటంతో ఫిరోజ్‌గా యాల పాలయ్యాడు.కేసును శాలిబండ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అత్తతో గొడవపడి కట్టుకున్న భార్యను హత్య చేసిన భర్త

**కంటోన్మెంట్,జూన్ 19 ప్రభాతవార్త:** అత్తతో గొడవపడి కట్టుకున్న భార్యను కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసిన సంఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది.ఇన్‌స్పెక్టర్ అంబాల అంజనేయులు తెలిపిన వినవరాల ప్రకారం రామగుండం ధర్మరం రోడ్డు భసంత నగర్ ప్రాంతానికి చెందిన ఉప్పూతల లక్ష్మణ్ (44 ) పొట్టకూటి కోసం సంవత్సరం క్రితం నగరానికి వలసవచ్చి అడ్డగుట్టలో నివాసం ఉంటున్నారు. అదే విధంగా లక్ష్మణ్ అత్త లక్ష్మి కూడా అడ్డగుట్టలో నివాసం ఉంటూ సమీపంలో ఉన్న ఓ ఫాస్ట్‌ఫుడ్‌తో పనిచేస్తుంది. మంగళవారం రాత్రి లక్ష్మణ్ అత్త పనిచేస్తున్న చోటికి వచ్చి అత్తతో గొడవ పడ్డాడు.విషయం తెలుసుకున్న అతని భార్య రోజ మా అమ్మతో అనవసరంగా ఎందుకు గొడవపడుతున్నావని భర్తను ప్రశ్నించి ఇంటికి తీసుకెళ్లింది. దీంతో భార్య భర్తల మధ్య గొడవ తీవ్ర స్థాయికి చేరింది. ఆగ్రహానికి గురైన లక్ష్మణ్ కట్టుకున్న భార్యను తమ పిల్లలు కండ్ల ముందే కత్తితో కడుపులో,తోడపైన, నోటిపైన విచక్షణ రహితంగా పొడిచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు. లక్ష్మణ్, రోజలకు కుమారుడు ప్రభు, కూతుర్లు గుండమ్మ, మమ్మీలు ఉన్నారు.

## మలక్‌పేటలో చైన్ స్నాచింగ్

**మలక్‌పేట, జూన్ 19 ప్రభాతవార్త:** మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళ వారం రాత్రి మహిళ మెడలో బంగారు గొలుసు దింగతనం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జయమ్మ (60) భర్త నరసింహతో కలిసి ఆనంద్ నగర్ అనిత నర్సింగ్ హోమ్ నుంచి ముంతాజ్ కాలేజీ రోడ్ లోని వారి ఇంటికి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని 4 తులాల బంగారు పుస్తేల తాడు తెంచుకొని పరారయ్యాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళ అదృశ్యం..

**జగద్గిరిగుట్ట, జూన్ 19, ప్రభాతవార్త**

మహిళ అదృశ్యమైన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సబ్ఇన్స్‌పెక్టర్ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం కండ్లకుంట సుబ్బారావు తన కుటుంబతో కలిసి పాపిరెడ్డి నగర్, బ్లాక్ ఏ, రోడ్ నెంబర్ 6, జగద్గిరిగుట్టలో నివాసం ఉంటున్నాడు. బుధవారం ఉదయం సుమారు 9:30 నిమిషాలకు సుబ్బారావు భార్య కండ్లకుంట శ్రీదేవి (50) భర్తకు చెప్పకుండా ఇంటి నుండి వెళ్లిపోయింది. ఆమె వద్ద ఫోన్ కూడా లేకపోవడంతో చుట్టుప్రక్కల అంతా వెతికినా ఆచుకీ దరొకలేదు. తరువాత సుబ్బారావు పోలీసులకు సమాచారం ఇవ్వడంతోనే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


# దశదినకర్మ



జననం: 08.03.1963

మరణం: 10.06.2024

కీ॥శే॥ తలసాని శంకర్ యాదవ్ గారు

Ex-President
The Secunderabad Vegetable Commission Agents Association

మంచికి మారుపేరుగా నిలిచి అందరి హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించి ఎందరో జీవితాలలో వెలుగులు నింపి వారి బాగుకు భవిష్యత్తుకై బాటలు వేశారు. మీ ఆకస్మిక మరణం తీరని లోటు, మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ... వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాడ సానుభూతిని సంతాపాన్ని తెలియజేస్తూ వారికి మనోధైర్యాన్ని ఆ భగవంతుడు ఇవ్వాలని కోరుకుంటూ...

శోకతప్త హృదయాలతో...

## THE SECUNDERABAD VEGETALBE COMMISSION AGENTS ASSOCIATION

**President:** SOMA DEVENDER REDDY

**Vice Presidents:** MIRYALA SRINIVAS, K. SRIKANTH REDDY

**General Secretary:** S. CHANDRA REDDY

**Treasurer:** P. KRISHNA

**Joint Secretaries:** K. BIKSHAMAIAH, CH. ANJI, S. PRABHKAR, K. SATYANARAYANA, GOLI SURENDER

**Organising Secretaries:** M. RAJ KUMAR, M. SADANANDAM, A. RAJU, MULUPALA DEVENDER

**Committee Members:** N. MADU KUMAR, CH. SRINIVAS, CH. ANJAIAH, M. CHANDRA SHEKAR, BANDA VEERESHAM, B. MANIK REDDY, CH. ILESH, CH. MADHU, G. MALLESHAM, E.CHANDRA MOHAN, CH.RAJU, R. RAVINDER, P.RAJENDER

కార్యస్థలం: తేది: 20.06.2024న గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు S.V.I.T. కన్వెన్షన్ ప్యాట్నీ సెంటర్, సికింద్రాబాద్ నందు పెద్దకర్మ జరుపబడును

## స్పందించిన కార్పొరేటర్ పవన్‌కుమార్ సమస్యను పరిష్కరించాలని ఆదేశం



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, జూన్ 19 ప్రభాతవార్త:** స్థానిక సమస్యపై కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ స్పందించారు. వర్షం పడితే అడుగు తీసి అడుగు వేయలేం పట్టించుకోని అధికారులు ప్రజాప్రతినిధులు అనే శీర్షిక బుధవారం... ప్రభాత వార్తలో.... ప్రచురితం కావడంతో అందుకు స్పందించిన కార్పొరేటర్ బుధవారం ఉదయం వెంటనే మోహన్‌నగర్ హనుమాన్ దేవాలయం రోడ్డులోని ముంపు ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హనుమాన్ ఆలయం ఆవరణంలో గతంలో ఎప్పుడో వేసినటువంటి డ్రైనేజీ వ్యవస్థ అంత పడైపోయి ప్రతినిత్యం డ్రైనేజీనీళ్లు పొంగుతున్నాయని, దీంతో నడవడానికి ఇబ్బందిగా వుందని, వర్షాకాలం వస్తే రోడ్డు అంత చెరువును తలపిస్తోందని తెలిపారు. జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ విభాగం ఏఈ మాత్రునాయక్, జలమండలి అధికారులు, పారిశుద్ధ్య విభాగం సిబ్బందినీ పిలిపించి సమస్యను రప్పించి సమస్యను వివరించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అక్కడే ఉండి డ్రైనేజీనీళ్లు బయటకు రాకుండా లైన్‌కు మరమ్మత్తులు చేయించారు. మోహన్‌నగర్ బస్తిలో మళ్ళీ డ్రైనేజీ సమస్యలు, వర్షపునీరు బస్తీలో ఎక్కడ ఆగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాలనీలో ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి పారిశుద్ధ సిబ్బందికి ఆదేశించారు. కార్పొరేటర్ స్పందించి సమస్యను పరిష్కరించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు కొత్త తిరుమల, వెంకట్‌రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాలి : చింతల అరుణ

**ఎల్.బి.నగర్, జూన్ 19 ప్రభాతవార్త:** వర్షాకాలంలో కాలనీ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జలమండలి అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణసురేంద్రనాథ్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు. నాగోల్ గ్రామంలోని కార్పొరేటర్ నివాసంలో జలమండలి అధికారులతో డివిజన్ సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని కాలనీలోని డ్రైనేజిలైన్స్ పనులు తొందరగా పూర్తి చేయాలని, కాలనీలో డ్రైనేజీ ఓవర్‌ఫ్లో కాకుండా మరమ్మతులు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న డ్రైనేజిలైన్స్ భారీవర్షాలు రాకముందే పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జలమండలి డీజీఎం మాధవి, ప్రేమ్‌సాగర్, మేనేజర్ అర్చన, ఏఈ రాకేష్, వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సూపర్వైజర్ రమేష్, హుస్సేన్, నాయకులు సిద్దాల ఐలయ్య, నరేందర్‌రెడ్డి, మనోజ్, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యాకుత్‌పుర బిజెపి కన్వీనర్‌గా వెంకట్‌రెడ్డి


వెంకట్‌రెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి

**సైదాబాద్, జూన్ 19 ప్రభాతవార్త:** యాకుత్‌పుర అసెంబ్లీ బిజెపి కన్వీనర్‌గా కుర్మగూడకు చెందిన బండ వెంకట్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ యాకుత్‌పుర నియోజకవర్గం పరిధిలోనిన అన్ని డివిజన్లలో బిజెపిని మరింత బలోపేతం చేయడానికి తన శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. పార్టీ అధిష్టానం చేపట్టే అన్ని కార్యక్రమాలు నియోజకవర్గంలో విజయవంతం చేస్తామన్నారు. పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి పాటుపడుతానని అన్నారు. రాబోయే జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో గ్రేటర్ పీఠాన్ని బిజెపి కైవసం చేసుకుంటుందన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం : ప్రేమ్‌కుమార్


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ తదితరులు

**మల్కాజిగిరి, జూన్ 19 ప్రభాతవార్త:** ఈస్ట్ ఆనంద్ భాగ్ డివిజన్ పరిధిలోని వసంతపురికాలనీలో 15లక్షలతో సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను దశలవారిగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను తనకు నేరుగా తెలియజేయాలని వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ లౌక్యా, ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజినీకాంత్, నాయకులు సత్యమూర్తి, బాబు, సత్యనారాయణ, ఎస్ ఆర్.ప్రసాద్, రంగా విజయకుమార్, బ్రహ్మయ్య, అచ్చిరెడ్డి, రాము, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సంక్షేమానికి కృషి : చంద్రశేఖర్


అంగన్‌వాడి కేంద్రంలో చిన్నపిల్లలతో కలిసి కేక్ చేస్తున్న చంద్రశేఖర్

**మలక్‌పేట, జూన్ 19 ప్రభాతవార్త:** విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తామని టిపిసిసి ఎస్సీ విభాగం స్టేట్ కన్వీనర్ బోనగిరి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మూసారాంబాగ్ డివిజన్‌లోని సంజీవ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్న పిల్లలతో కలిసి ఆయన కేక్ కట్ చేసి విద్యార్థులకు పండ్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తుందని అన్నారు. అంగన్‌వాడి కేంద్రంలో ఎటువంటి ఇబ్బంది ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని వెంటనే వాటిని పరిష్కరిస్తామని హామీనిచా చ్చరు. ఈ కార్యక్రమంలో నాయకులు ముప్పిడి ధన్వంత్, ప్రభాకర్‌చారి, మల్లేష్, మురళిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి గజమాలతో చింతల సత్కారం


హోంమంత్రి బండి సంజయ్‌కి గజమాల వేస్తున్న చింతల సురేంద్రనాథ్‌యాదవ్

**ఎల్.బి.నగర్, జూన్ 19 ప్రభాతవార్త:** హిందూ జన సంరక్షకుడు కాషాయ దళపతి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ బిజెపికి బలం బలగమని బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్ర నాథ్‌యాదవ్ పేర్కొన్నారు. కరీంనగర్ నుంచి రెండుసార్లు పార్లమెంట్ సభ్యునిగా ఘనవిజయం సాధించి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవిని పొంది బుధవారం నగరానికి వచ్చిన సందర్భంగా బేగంపేట్ విమానాశ్రయంలో చింతల సురేంద్రనాథ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు వారి గజమాలతో బండి సంజయ్‌ని సత్కరించి, ఘన స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సిద్దాలా ఐలయ్య, మనోజ్ పాల్గొన్నారు.

## నంది అవార్డు గ్రహీత రమేష్‌కు సత్కారం


నంది అవార్డు గ్రహీత రమేష్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, జూన్ 19 ప్రభాతవార్త :** నంది అవార్డు గ్రహీత ఎల్.రమేష్‌ను బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నంది అవార్డు సాధించిన రమేష్ సేవలు అభినందనీయమన్నారు. రమేష్ మాట్లాడుతూ నంది అవార్డు దక్కడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉప్పల్ బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సేవాదళ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులుగా సయ్యద్ ఇస్మాయిల్



ఇస్మాయిల్‌కు నియామక పత్రం అందజేస్తున్న జితేందర్

**ఎల్.బి.నగర్, జూన్ 19 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులుగా ఆర్కేపురం డివిజన్‌కు చెందిన సయ్యద్ ఇస్మాయిల్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ నియామకపు ఉత్తర్వులు జారీ చేసి రాష్ట్ర కార్యాలయంలో సయ్యద్ ఇస్మాయిల్‌కు నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మిద్దెల జితేందర్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని, ప్రభుత్వ పథకాలను పేదలకు వివరించి వారిని చైతన్యవంతులను చేసేందుకు సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు పాటుపడాలని పిలుపునిచ్చారు. జితేందర్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని, సేవాదళ్‌ను బలోపేతం చేస్తానని పేర్కొన్నారు. రాబోయే జీహెచ్‌ఎంసీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటేందుకు తనవంతు కృషి చేస్తానని హామీనిచ్చారు.

## హోమియో ఆసుపత్రిలో చెత్త పేరుకు పోకుండా చర్యలు తీసుకోవాలి : లచ్చిరెడ్డి


హోమియో ఆసుపత్రిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం, జూన్ 19 ప్రభాతవార్త:** బి.యన్.రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ హోమియోపతి ఆసుపత్రిలో చెత్తాచెదారాలు, చెట్ల కొమ్మలు ఎక్కడికక్కడ పేరుకుపోయి వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డికి హోమియోపతి హాస్పిటల్ డాక్టర్ నర్మద సమాచారం ఇవ్వడంతో స్పందించిన కార్పొరేటర్ హోమియోపతి ఆసుపత్రిని సందర్శించి వెంటనే సంబంధిత సిబ్బందితో శుభ్రం చేయించారు. ఆసుపత్రిలో తరచుగా శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జైపాల్‌రెడ్డి, జిహెచ్‌ఎంసి ఏఈ నరేంద్రతేజ, జిహెచ్‌ఎంసి ఎస్ఎస్ అజీమ్‌ద్దీన్, జవాన్ రామచందర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**హయత్‌నగర్, జూన్ 19 ప్రభాతవార్త:** నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లో నోట్ పుస్తకాలు, బ్యాగులు, ఇతర స్టేషనరీ విక్రయించడాన్ని నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్ హయత్‌నగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.శివకుమార్, గ్యారక్రాంతి మాట్లాడుతూ... పాఠశాలల్లో నోటుపుస్తకాలు, బ్యాగులు, స్టేషనరీ విక్రయించరాదని విద్యాశాఖ అధికారులు ఆదేశాలిచ్చినా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తూ విద్యాశాఖ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారని వివరించారు. కాకతీయ పాఠశాల యాజమాన్యం ఎలాంటి అనుమతులు తీసుకోకుండా సెట్‌బ్యాక్‌లేని జీ+4 బిల్డింగ్‌లో తరగతులను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. హయత్‌నగర్ మండల వ్యాప్తంగా చాలా పాఠశాలల యాజమాన్యాలు ఫైర్‌సేఫ్టీ, సెట్‌బ్యాక్ లేని భవనాల్లో పాఠశాలలను నడిపిస్తున్నార న్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేయడమే కాకుండా పుస్తకాలు, డ్రెస్సులు, ట్రాన్స్‌పోర్టు పేరులో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ముక్కు పిండి మరీ వసూళ్లు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిపై చర్యలు తీసుకోవాల్సిన మండల విద్యాశాఖ అధికారి పట్టించుకోవడం లేదన్నారు. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సామిడి వంశీవర్ధన్‌రెడ్డి, అరుణ్‌కుమార్, వెంకటేష్, బన్నీ, భాను, వెంకటేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే బలాల


కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

**మలక్‌పేట, జూన్ 19 ప్రభాతవార్త:** ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే బలాల పేర్కొన్నారు. మలక్‌పేట నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన లబ్దిదారులకు ఎమ్మెల్యే బలాల కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 83 మంది లబ్దిదారులకు రూ. 83 లక్షల 9 వేల 6 వందల 28 విలువ గల చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. పేద మహిళల వివాహాలకు ఈ పథకాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి : న్యాయవాది రాపోలు భాస్కర్


మీడియాతో మాట్లాడుతున్న న్యాయవాది రాపోలు భాస్కర్

**సైదాబాద్, జూన్ 19 ప్రభాతవార్త:** తెలంగాణాలో విద్యహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ అన్నారు. కళ్యాణ్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం కింద ప్రతి కార్పొరేట్ పాఠశాలలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాలన్నారు. ప్రభుత్వాలు ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించడం వల్ల నేడు విద్య వ్యాపారంగా మారిపోయిందన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాల్సిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు వాటి పేరుతో వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆయన విమర్శించారు. విద్యా హక్కు చట్టం పకడ్బందీగా అమలు చేయాలని, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో డ్రస్సులు, పుస్తకాలు అమ్మే విధానాన్ని పూర్తిగా అరికట్టాలన్నారు. ఒకే పేరుతో వందలాది బ్రాంచీలు పెడుతూ విద్యా వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల అనుమతులు రద్దు చేయాలన్నారు. ఎలాంటి సేఫ్టీ లేకుండా ఇరుకైన గదుల్లో తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. వీటన్నింటిపై ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే న్యాయ పోరాటం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

## భూదాన భూమిలో పేదలకు ఇళ్ల పట్టాలిచ్చి న్యాయం చేయాలని వినతి


ముఖ్యమంత్రికి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

**హయత్‌నగర్, జూన్ 19 ప్రభాతవార్త:** అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ పరిధి కుంట్లూర్ గ్రామంలోని భూదాన భూమిలో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలిచ్చి న్యాయం చేయాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సాంబశివరావు, రాష్ట్ర నాయకులు ఆందోజు రవీంద్రచారి, పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ కుంట్లూర్ గ్రామపరిధి రావినారాయణరెడ్డి కాలనీ ఫేజ్-3లోని 215 నుంచి 224 సర్వేనెంబర్లలో 80 ఎకరాల భూమిలో ఏడాదిన్నరగా పేదలు గుడిసెలు వేసుకుని అరకొరవసతులతో జీవనం సాగిస్తున్నారని వివరించారు. సదరు భూదాన భూమిపై కన్నేసిన కొందరు భూస్వాములు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు దానిని కబ్జాచేయడానికి యత్నిస్తున్నారని తెలిపారు. భూదాన భూమిపైనున్న లీగల్ సమస్యలను పరిష్కరించడంతో పాటు ఆ భూమి ఆక్రమణకు గురికాకుండా చూడాలని, అందులో పేదలకు ఇళ్లపట్టాలిచ్చి గృహలక్ష్మి పథకం కింద ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు ముఖ్యమంత్రికి విన్నవించారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని, సంబంధిత రెవెన్యూ మంత్రి, అధికారులతో మాట్లాడి నివేదికను పరిశీలించి పేదలకు న్యాయం చేస్తామని హామీనిచ్చారని వారు తెలిపారు.

## వెంకటేశ్వర కాలనీలో రూ.75లక్షలతో సిసి రోడ్డు పనులు : కార్పొరేటర్ రజితరెడ్డి


సిసి రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి తదితరులు

**ఉప్పల్, జూన్ 19 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ వెంకటేశ్వరకాలనీలో రూ. 75లక్షల వ్యయంతో సిసి రోడ్డు పనులు చేపడుతున్నట్లు కార్పొరేటర్ మందముల రజితరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ వెంకటేశ్వర కాలనీ నుంచి పోచమ్మ ఆలయానికి వెళ్లే దారిలో కొత్తగా చేపడుతున్న సిసి రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వెంకటేశ్వరకాలనీలో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వరద ముంపు సమస్య నుంచి తప్పించేందుకు కాలనీలో సివరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంటు వైపు పంపించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వరద సమస్య పూర్తిగా పరిష్కరిస్తున్నామనితెలిపారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ నేతలు కె.సతీష్‌గౌడ్, బజారు జగన్‌గౌడ్, ఎన్.శ్రీనివాస్, సల్ల ప్రభాకర్‌రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, అల్వాల్ భాస్కర్, జనగామ రామకృష్ణ, జగన్, విజయేందర్, పాండు, కుమారస్వామి, సోమయ్య, విజయభాస్కర్, రాజ్‌కుమార్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి


శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, జూన్ 19 ప్రభాతవార్త:** స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ కార్పొరేషన్ 31వ డివిజన్ సాయిబాలాజీ టౌన్‌షిప్ ఫేజ్-1 కాలనీలో కమ్యూనిటీ హాల్‌లో రంగారెడ్డి జిల్లా జన శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో వృత్తి విద్యా శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా మహిళలకు బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన పారిజాత శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జన శిక్షణా సంస్థాన్ ప్రతినిధులు, స్థానిక మహిళలలతో పాటు మహిళా కాంగ్రెస్ నాయకురాలు అమృతా నాయుడు పాల్గొన్నారు.

## బస్తీలో ప్రభుత్వ ఆసుపత్రి, ఐటిఐ కాలేజ్‌ను నిర్మించాలని డిప్యూటీ మేయర్‌కు వినతి


ఐటీఐ కాలేజ్, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించాలని డిప్యూటీ మేయర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న శ్రీరామ గండికోట వడ్డెర సొసైటీ నాయకులు

**తార్నాక, జూన్ 19 ప్రభాతవార్త:** అధికంగా నిరుపేద, మధ్యతరగతి ప్రజలు ఉండే మాణికేశ్వరీనగర్ బస్తీలో ఐటీఐ కాలేజ్, వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించాలని కోరుతూ శ్రీరామ గండికోట వడ్డెర సొసైటీ అధ్యక్షులు గండికోట కుమార్ నగర డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. అదే విదంగా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని కోరారు. దోమల సమస్యతోపాటు, అర్హులైన వృద్దులకు పెన్షన్లు రావడంలేదని వినతి పత్రంలో కోరారు. విద్యుత్ స్థంబాలను మార్చాలని, ఫేజ్2 కమ్యూనిటీ హాల్లో అదనపు ఫ్లోర్‌ను నిర్మించాలని, అక్కడే బాత్‌రూంలను ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో శ్రీరామగండికోట వడ్డెర సొసైటీ ఉపాధ్యక్షులు జి. శ్రీనివాస్, కార్యదర్శి జి.కిరణ్, జాయింట్ సెక్రెటరీ జి.దుర్గేష్, యాదయ్య, కుమార్, గిరి, శివ, నవీన్, లక్ష్మణ్, నవీన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## డాక్టర్ మోహన్ సింగ్ వ్యక్తిత్వము, రచనలపై ఓయూలో జాతీయ సదస్సు..

**నేరెడ్‌మెట్, జూన్ 19 ప్రభాతవార్త:** డాక్టర్ మోహన్‌సింగ్ వ్యక్తిత్వము, రచనలు, చర్చలు అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ రూమ్ నెం: 57లో నిర్వహించిన జాతీయ సదస్సుకు మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం హాజరైంది. సదస్సు కన్వీనర్ జగన్ సదస్సుకు అధ్యక్షత వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ హిందీ విభాగాధ్యక్షురాలు ప్రొఫెసర్ మాయ ఆచార్య మోహన్‌సింగ్ వ్యక్తిత్వాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి పాల్గొని మోహన్‌సింగ్ గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి జాయింట్ డైరెక్టర్ రాజేందర్ సింగ్, వైస్ చైర్మన్ మహమూద్, ప్రొఫెసర్ మాణిక్యాంబ, వేణుగోపాల్ రెడ్డి, బాలాజీ సింగ్, డాక్టర్ దత్త, డాక్టర్ శ్యామ్ సుందర్, డాక్టర్ సంగీత, డాక్టర్ అజయ్, డాక్టర్ బ్రిజేష్, డాక్టర్ స్వప్న, డాక్టర్ సీతారాం, డాక్టర్ బండి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వనస్థలిపురం కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

**వనస్థలిపురం, జూన్ 19 ప్రభాతవార్త:** వనస్థలిపురంలోని కన్యకా పరమేశ్వరి దేవాలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న టిపిసిసి ప్రచార కమిటీ కన్వీనర్, ఐవీఎఫ్ తెలంగాణ స్టేట్ అధ్యక్షుడు తెలంగాణ స్టేట్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకొని అమ్మవారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఫౌండర్, మాజీ చైర్మన్ చింతల రవికుమార్, బిజెపి లీడర్ తడకమల్ల రవికుమార్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతల రజనీకాంత్, నాలం రమేష్, సురేష్, కిషోర్ కుమార్‌గుప్తా, విజయకుమార్‌గుప్తాతోపాటు వనస్థలిపురం ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## కార్మికులకు అండగా సిఐటియు:భూపాల్

**ఎల్.బి.నగర్, జూన్ 19 ప్రభాతవార్త :** నిరంతరం శ్రమించే కార్మికులకు సిఐటియు అండగా ఉంటుందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ పేర్కొన్నారు. ప్రైవేట్ అపార్ట్‌మెంట్స్ వాచ్‌మెన్ సెక్యూరిటీ గార్డ్స్ జిల్లా కార్యదర్శి డి.బీమా నాయక్ బ్రెయిన్ స్ట్రోక్‌తో అకాల మరణం చెందాడంతో సిఐటియు సంతాపం తెలియజేసి యూనియన్ల సహకారంతో రూ.65 వేల ఆర్థిక సహకారం అందజేశారు. భీమానాయక్ భార్యకు పోస్ట్‌ఆఫీస్‌లో ఫిక్స్ చేసిన రూ.65 వేల డిపాజిట్ బాండును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కొరకు సిఐటియు కృషి చేస్తుందని అన్నారు. ప్రైవేట్ అపార్ట్మెంట్ సెక్యూరిటీ, వాచ్మెన్‌లకు ప్రభుత్వము హెల్త్‌ఇన్సూరెన్స్ సౌకర్యం, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కార్మికులని ఆదుకునే విధంగా చట్టాన్ని చేసి కార్మికులను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామ్మోహన్, సరూర్నగర్ కన్వీనర్ ఎం,వీరయ్య, ఆలేటి ఎల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ అధికారులతో శ్రీవాణి సమీక్ష

**ఉప్పల్, జూన్ 19 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్‌లో వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ ఎఇ శ్వేత, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, జలమండలి డిజిఎం రజనీకాంత్‌రెడ్డి, మేనేజర్ పల్లె రవీందర్, కిషన్ తదితరులతో ఆమె సమీక్ష నిర్వహించి పలు అంశాలను చర్చించారు. రామంతాపూర్ డివిజన్‌లోని పలు కాలనీలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని, మ్యాన్‌హోల్ కవర్లు వేయాలని, రోడ్డు తవ్విన వెంటనే వాటికి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలపై పోరాటం : సిఐటియు

**ఉప్పల్, జూన్ 19 ప్రభాతవార్త :** జిహెచ్‌ఎంసి డంపింగ్ యార్డు డ్రైవర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం జెండా అవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎ.అశోక్, ఉప్పల్ కార్యదర్శి జె.వెంకన్న మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి చెత్త డంపింగ్ యార్డు వద్ద సిఐటియు డ్రైవర్ల కార్మిక సంఘం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్మికులకుఅండగా సిఐటియు ఉంటుందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వె.వెంకటేశ్వర్లు, డంపింగ్ యార్డు డ్రైవర్లు కార్మికులు పాల్గొన్నారు.